సాక్షి వనపర్తి

బుధవారం ၊ 3 ၊ జూలై ၊ 2024



'స్థానిక'ం ఎప్పుడో?

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొస్తాయా అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు.

వివరాలు 8లో ▸



..బ్యాడ్మింటన్ టోర్నీ

పాలమూరులోని ఇండోర్ స్టేడియం బ్యాడ్మింటన్ పోటీలకు వేదిక కానుంది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం

31.2 /23.7

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీయడంతో పాటు మోస్తరు వర్షం కురవచ్చు.

న్యూస్‌రీల్

నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ : ఏబీవీపీ



వనపర్తిటౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు అవుతున్నా.. నేటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సాతర్ల అర్జున్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీవీపీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని మాయమాటలు చెప్పి గద్దెనెక్కి నిరుద్యోగులను మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, గ్రూప్–2, గ్రూప్–3 పోస్టులను పెంచాలన్నారు. 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలని, యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్ల వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలకృష్ణ, నాయకులు కేదారీనాథ్, కార్తీక్, హరికృష్ణ, యశ్వంత్ పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్



వనపర్తిటౌన్: కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించాలంటూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని.. విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా సహకరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అసమర్థ ఎన్‌టీఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసి, నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ ప్రవేశాలకు ఇటీవల ఆమోదించిన నెట్‌స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. ముంబై నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు, ప్రజాస్వామ్య అణిచివేత చర్యలను ఆపాలని, పాఠశాలల మూసివేత నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు భరత్, సాయి, మహేష్ పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా బోధన

వీపనగండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా అన్ని రకాల వసతులు సమకూరుతున్నాయనే విషయాన్ని తల్లిదండ్రులకు వివరించి సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంపీడీ సుల్తాన్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు ఉన్నారు.

వాకిటికి అమాత్యగిరి?!

పాలమూరు నుంచి మరొకరికి మంత్రి యోగం

- ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి అవకాశం కల్పిస్తామని గతంలోనే సీఎం రేవంత్ హామీ
- ఏకైక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి బెర్త్ ఖరారుపై ఆశలు
- వరిస్తే ఉమ్మడి జిల్లాలో తొలిసారి ఎమ్మెల్యేగా.. మంత్రిగా ఘనత
- హాట్‌టాపిక్‌గా మారిన మంత్రివర్గ విస్తరణ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమైంది. ఈ నెల నాలుగో తేదీన ముహూర్తం సైతం ఖరారైనట్లు ప్రచారం ఊపందుకోగా.. ఎవరెవరిని అమాత్యగిరి వరిస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మంత్రి పదవులు ఆశిస్తున్న ఎమ్మెల్యేలు పలువురు ఢిల్లీ బాట పట్టడంతో పాటు కీలక నేతలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌తో పాటు రాజకీయ పక్షాలు ఉమ్మడి జిల్లాలు, సామాజిక వర్గాల వారీగా విశ్లేషిస్తూ.. ఎవరెవరికి మంత్రి పదవులు దక్కుతాయని లెక్కలేస్తుండగా ఉత్కంఠ నెలకొంది. ఈ విస్తరణలో ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా పాలమూరు నుంచి ఒకరికి బెర్త్ ఖాయమనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీసీ సామాజిక వర్గంలో అత్యధిక జనాభా ఉన్న ముదిరాజ్‌లకు మొదటి విడతలో మంత్రి పదవి లభించలేదు. ఈ మేరకు త్వరలో జరిగే విస్తరణలో ఆ సామాజిక వర్గానికి చెందిన వారికి మంత్రి పదవి ఖాయమని కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో ఆ సామాజిక వర్గం నుంచి ఏకైక ఎమ్మెల్యే.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వాకిటి శ్రీహరి కాగా.. ఆయననే మంత్రి పదవి వరించనున్నట్లు తెలుస్తోంది.

'స్థానిక'ంగా బలోపేతమే లక్ష్యంగా..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ సత్తా చాటి పెద్ద పార్టీగా అవతరించింది. మొత్తం 14 శాసనసభ నియోజకవర్గాలు ఉండగా.. 12 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. రేవంత్‌రెడ్డి సీఎం కాగా.. జూపల్లి కృష్ణారావును మంత్రి పదవి వరించింది. ఆ తర్వాత పలువురు కాంగ్రెస్ నేతలకు నామినేటెడ్ పోస్టులు దక్కగా.. మరికొంత మంది ఆశావహులు తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి ఏకు మార్చేలా ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు. దీంతోపాటు ఈసారి మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు స్థానం కల్పిస్తామని ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే శ్రీహరికి మంత్రి పదవి దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. భవిష్యత్‌లో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సంస్థాగతంగా పార్టీ బలోపేతం కావాలంటే ముదిరాజ్ సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచనలో రేవంత్‌రెడ్డి ఉన్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



..అయితే తొలిసారే..

ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ఒకరు మంత్రిగా ఉండడం.. ముఖ్యమంత్రి ఇదే జిల్లాకు చెందినవారు కావడంతో మరో మంత్రి పదవి ఇస్తారా.. లేదా అనే మీమాంస కొనసాగుతోంది. అంతేకాకుండా ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపును సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కానీ, ఇక్కడ బీజేపీ అభ్యర్థి విజయం సాధించడంతో జిల్లాకు చెందిన పార్టీ నేతలపై సీఎం అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలోకి వచ్చే మక్తల్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి బీజేపీ కంటే తక్కువ ఓట్లు రావడం శ్రీహరికి మైనస్‌గా మారిందనే వాదన సైతం కాంగ్రెస్ వర్గాల్లో వినిపిస్తోంది. వాకిటి వర్గీయులు మాత్రం మంత్రి పదవి ఖాయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. శ్రీహరిని మంత్రి పదవి వరించిన పక్షంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి అయిన ఘనత ఆయనకే దక్కనుంది.

ఖర్గేతో సాన్నిహిత్యం..

రాహుల్ ప్రశంసలు

కర్ణాటక సరిహద్దులో ఉన్న మక్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీహరికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో మంచి సాన్నిహిత్యం ఉంది. మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తారనే పేరు శ్రీహరికి ఉంది. సర్పంచ్‌గా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉండగా.. నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా సైతం బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్రను మక్తల్ నియోజకవర్గంలో విజయవంతం చేసి ప్రశంసలు పొందారు. ఇవన్నీ శ్రీహరికి కలిసి వస్తాయని ఆయన వర్గీయులు భావిస్తున్నారు.

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, పీహెచ్‌సీల వైద్యాధికారుల సమీక్షలో ఆయన మాట్లాడారు. పేదలు ప్రసవాల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి రూ.వేలు వెచ్చిస్తున్నారని.. వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయాలని సూచించారు. వైద్యాధికారులు వారి పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి గర్భిణితో మాట్లాడి వారికి ప్రభుత్వ ఆస్పత్రిలోని చికిత్సపై నమ్మకం కల్పించాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే ప్రతి వంద మంది గర్భిణుల్లో 75 శాతం మందికి సిజేరియన్ కాన్పులే చేస్తున్నారని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 40 శాతం ప్రసవాలు మాత్రమే సిజేరియన్ చేస్తున్నట్లు నివేదికల ద్వారా తెలుస్తోందని.. దీనిని మరింత తగ్గించాల్సిన అవసరం ఉందని కోరారు. ప్రతి గర్భిణికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌సీ నమోదు చేయించి ప్రసవం జరిగే అంచనా తేదీని నమోదు చేయాలన్నారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తూ రక్తహీనత లేకుండా తగిన సూచనలు చేయాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో రికార్డుల నిర్వహణ సరిగా ఉండాలని, వైద్యసిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వర్తించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని.. డ్రై డే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జ్వరంతో ఆస్పత్రికి వచ్చిన రోగులకు రక్త పరీక్షలు నిర్వహించి డెంగి, చికెన్ గున్యా, మలేరియా నిర్ధారణ అయితే నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. జయచంద్ర మోహన్, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులు..

అంగన్‌వాడీల్లో కనీస మౌలిక వసతులు విధిగా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమశాఖ, పీఆర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పనకు వెంటనే చర్యలు ప్రారంభించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి లక్ష్మీబాయి స్పందిస్తూ.. 154 కేంద్రాల్లో మరుగుదొడ్లు, 50 కేంద్రాల్లో తాగునీటి వసతి, 10 కేంద్రాల్లో ఇతర మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఆయా కేంద్రాల్లో వెంటనే పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఇంజినీర్లకు సూచించారు. అదేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వారంలోగా పూర్తి చేయాలని కోరారు. పీఆర్ ఈఈ మల్లయ్య, ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం



మన్ననూర్‌లో చెంచు మహిళలతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వంశీకృష్ణ

- ఇప్పటికే సాగులో ఉన్న వాటిని కొనసాగిస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల రుణాలు
- సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధికి కృషి
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

సాక్షి, నాగర్‌కర్నూల్/ అచ్చంపేట/ అమ్రాబాద్/ మన్ననూర్/ఉప్పునుంతల: గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూముల విషయంలో ప్రభుత్వం త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం ఆమె అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి నల్లమల ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి పలు భవనాల ప్రారంభంతోపాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో చెంచు మహిళలతో సమావేశం, పలు భవనాల ప్రారంభోత్సవం, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. పోడు భూముల విషయంలో ఇప్పటికే సాగులో ఉన్న గిరిజనులకు న్యాయం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. గిరిజనులు తమ భూముల్లో పండ్లతోటలు, ఆదాయాన్ని ఇచ్చే ఉద్యాన పంటలను సాగుచేయాలని సూచించారు. అడవిని కాపాడుకునేలా పంటల సాగుతోపాటు చెంచుల జీవనోపాధికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కొత్తగా అటవీ భూములను ఆక్రమించుకోకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నల్లమల బిడ్డ అయిన సీఎం రేవంత్‌రెడ్డికి ఇక్కడి ప్రజల కష్టాలు స్వయంగా తెలుసు అన్నారు. సొంత నియోజకవర్గంలో అభివృద్ధిపై ఆయన ప్రత్యేకంగా దృష్టిసారించారన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలోనే గిరిజనులకు సంక్షేమం, ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందాయని, ప్రస్తుత ప్రభుత్వంలోనూ గిరిజనుల సంక్షేమాన్ని పునరుద్ధరిస్తామన్నారు. చెంచులకు సరైన వైద్యం, విద్య, ఆహారం, ఇల్లు ఉండేలా చూస్తామన్నారు. కేజీబీవీల్లో ఇంటర్ వరకు విద్యాబోధన కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నామని, వీటిలో చదువుకునే విద్యార్థినులు డాక్టర్లు, ఇంజినీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు.

మహిళలను కోటీశ్వరులు చేస్తాం..

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 514 మహిళా సంఘాలకు రూ.50.10 కోట్ల బ్యాంకు రుణాల చెక్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి మండలాల వారీగా అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళా అభివృద్ధే లక్ష్యంగా నల్లమల ముద్దుబిడ్డ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.20 వేల కోట్ల రుణాలను మహిళా సంఘాలకు అభ్యున్నతికి అందజేస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు, పొదుపును పెట్టుబడిగా పెట్టి వ్యాపారంలో ఆర్థికంగా ఎదగాలని కోరారు. అచ్చంపేటలో మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని, మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్‌లు, ఇతర అవకాశాలు కల్పించాలని కోరారు. కొందరు గంజాయి, ఇతర మత్తు, చెడు అలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకోవడం బాధాకరమన్నారు. ఎక్కడైనా అలాంటి పరిస్థితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఉపాధి అవకాశాలపై దృష్టి..

తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి అన్నారు. రైతాంగ అభివృద్ధితోపాటు, విద్య, వైద్యం, కంపెనీల ఏర్పాటు, అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి సారించిందన్నారు. ఉద్యోగుల సమస్యలు కూడా పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చలు జరుపుతుందని వివరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమన్నారు. విద్య, వైద్యం, ఈ ప్రాంతానికి సాగునీటితో పాటు కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గతంలో చెంచుల కోసం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోపాటు జీసీసీ, ఈకో డెవలప్‌మెంట్ కమిటీలను పునరుద్ధరిస్తామన్నారు. అంతకు ముందు మంత్రులు సీతక్క పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర శాప్ చైర్మన్ శివసేనారెడ్డి, కలెక్టర్ సంతోష్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, డీఆర్‌డీవో చిన్న ఓబులేస్, జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధ, ఎంపీపీలు అరుణ, శ్రీనివాసులు, ప్రణీత, శోభ, సుజాత, చెంచు నాయకులు శంకరయ్య, శ్రీనివాసులు, పెద్దిరాజు, ప్రవీణ్‌కుమార్, గురువయ్య, నాగయ్య, రాజేంద్ర ప్రసాద్, సాయిలమ్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే మంత్రి సీతక్కను మన్ననూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు కలిశారు.

మహిళా ప్రయాణికులకు బహుమతులు

వనపర్తిటౌన్: డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ద్వారా బహుమతులు అందజేయనున్నట్లు ఆర్టీసీ డీఎం వేణుగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, కర్నూలు మార్గాల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులు టికెట్ వెనక తమ పేరు, ఫోన్‌నంబర్ రాసి బస్సులో డ్రైవర్ వెనుక వైపు ఉన్న లక్కీడ్రా బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు,, 16వ తేదీ నుంచి నెలాఖరు వరకు రెండుసార్లు డ్రా తీసి ముగ్గురు మహిళా ప్రయాణికులకు బహుమతులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.



■ 'ఈ ఫొటోలో కనిపిస్తున్న భవనం ఖిల్లాఘనపురం మండలం ఉప్పరిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల. గత ప్రభుత్వం మన ఊరు – మన బడిలో భాగంగా నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.61 మంజూరు చేయగా.. స్థల వివాదంతో పనులు పునాదులకే పరిమితమయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా విద్యుత్, టాయిలెట్స్, మైనర్, మేజర్ మరమ్మతులకు రూ.14 లక్షలు మంజూరు చేసింది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని.. ఈ పనులు చేపట్టడంతో లాభం లేదని.. శిథిల భవనానికి మరమ్మతులు వద్దు.. కొత్త భవనం నిర్మించాలంటూ సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు అర్జీ దాఖలు చేశారు.'

శిథిల భవనాలు.. అసంపూర్తి నిర్మాణాలు

పాఠశాలలు తెరిచినా పూర్తికాని మరమ్మతులు

- వర్షాకాలంలో తప్పని అవస్థలు
- పలుమార్లు సమీక్షించిన కలెక్టర్
- ఉప్పరిపల్లి యూపీఎస్ శిథిలావస్థకు చేరిందని ప్రజావాణిలో విద్యార్థుల ఫిర్యాదు



ప్రజావాణిలో కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న విద్యార్థులు (ఫైల్)

వనపర్తి: ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు, మరమ్మతులు పూర్తి చేయాల్సిన గడువు ముగిసి 20 రోజులైనా ఇంకా పనులు నత్తనడకన కొనసాగుతూనే ఉన్నాయి. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్ పలుమార్లు సమీక్షలు నిర్వహించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించినా.. ఫలితం మాత్రం శూన్యం. జిల్లావ్యాప్తంగా 286 పాఠశాలల్లో కనీస మరమ్మతులు పూర్తికాగా.. మిగతా 45 పాఠశాలల్లో కొనసాగుతూనే ఉన్నాయి.

ముందస్తు చెల్లింపులు చేసినా..

ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేయాల్సిన మరమ్మతులు ఆయా పాఠశాలల పేరెంట్స్ కమిటీతో చేయిస్తున్నందున ప్రభుత్వం అంచనాల్లో 25 శాతం నిధులు ముందుగా చెల్లించింది. కొందరు ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో నిర్దేశిత సమయానికి పూర్తికాలేదు. ఇటీవల కలెక్టర్ నిర్వహించిన సమీక్షలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎప్పటి వరకు పూర్తిచేస్తారో లిఖితపూర్వకంగా ఇవ్వాలని మందలించినా.. అధికారుల్లో స్పందన కరువైంది.

భయంగా ఉంది..



వర్షాకాలం వచ్చిందంటే చాలు మా పాఠశాల ఎప్పుడు కూలుతుందోనని భయం వేస్తుంది. వర్షం కురిసిన తర్వాత గోడల పెచ్చులు ఊడిపోతుంటాయి. పాఠశాలకు వెళ్లాలంటేనే భయం వేస్తుంది.

– విజయ్, 7వ తరగతి, యూపీఎస్, ఉప్పరిపల్లి

తరగతి గదులు నిర్మించాలి..



మా పాఠశాల భవనం ఎప్పుడు నిర్మించారో తెలియదు పూర్తిగా పాడైపోయింది. కలెక్టర్ సార్‌ను కలిశాం. మా పాఠశాల భవనాన్ని పరిశీలించి కొత్త భవన నిర్మాణం చేపట్టాలని కోరాం.

– అఖిల, 7వ తరగతి, యూపీఎస్, ఉప్పరిపల్లి

అటకెక్కిన మన ఊరు–మన బడి..

గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జిల్లా నుంచే మన ఊరు–మన బడి పథకాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల భవన మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం, ఇతర కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా.. ప్రభుత్వం మారటంతో అటకెక్కింది. ఈ పథకంలో తొలి విడతలో జిల్లాలో ఎంపిక చేసిన 180 పాఠశాలల్లో సుమారు రూ.69 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. గత విద్యాసంవత్సరం ప్రారంభం నాటికే పనులు పూర్తి చేయాల్సి ఉన్నా.. ఆలస్యమైంది. ఇప్పటికి పూర్తయినవి సగానికి కంటే తక్కువే. ఇప్పటి వరకు పనులు పూర్తయిన పాఠశాలలు 28, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నవి 17, రంగులు వేసేందుకు సిద్ధంగా ఉన్నవి 53, మిగతా వాటిలో పనులు పురోగతిలో ఉన్నట్లు అధికారుల నివేదికల్లో పేర్కొన్నా.. ప్రభుత్వం మారడంతో పాత పనులు నిలిపి అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట గతంలో నిధులు వెచ్చించిన పాఠశాలలకు సైతం కేటాయించి పనులు చేయించారు. ప్రజాధనం వృథా అవుతుందనే ధ్యాస అటు ప్రజాప్రతినిధుల్లోగాని, ఇటు అధికారుల్లోగాని లేకపోవటం గమనార్హం. రెండుసార్లు రెండు వేర్వేరు కార్యక్రమాల్లో పనులు చేసినా.. కొన్ని ప్రాంతాల్లో సమస్యలు తీరకపోవటం శోచనీయం.



ఉప్పరిపల్లి యూపీఎస్‌లో అదనపు గదుల నిర్మాణాలకు తీసిన పునాదులు

15వ తేదీలోగా పూర్తి..



అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతులు ఈ నెల 15లోగా పూర్తి చేస్తాం. ప్రధాన పనులు దాదాపుగా పూర్తయ్యాయి. మిగతా పనులు చేయిస్తున్నాం. జిల్లాలో నలుగురు ఏఈలతో పనుల పర్యవేక్షణ చేయిస్తూ.. నాణ్యతగా చేపడుతున్నాం. నాన్ సివిల్ వర్క్స్ పనుల్లో కొంత ఆలస్యం జరుగుతోంది. కలెక్టర్‌కు ఇచ్చిన తేదీ ప్రకారం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్, డీఈఈ, ఈడబ్ల్యూఐడీసీ, వనపర్తి

సమన్వయంతో పనులు పూర్తి..



జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఉన్న 331 పాఠశాలల్లో మరమ్మతులు ఈడబ్ల్యూఐడీసీ, పీఆర్, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. మూడుశాఖల ఇంజినీర్లు సమన్వయం చేసుకుంటూ.. ఈ నెల 10 నుంచి 15వ తేదీలోపు పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం.

– గోవిందరాజులు, ఇన్‌చార్జ్ డీఈఓ, వనపర్తి

క్లుప్తంగా

రైలు కిందపడి తండ్రి, కుమార్తె దుర్మరణం


శివానంద్ (ఫైల్)


చందన (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి తండ్రి, కుమార్తె మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మందిపల్‌కు చెందిన శివానంద్(50) కొన్నేళ్లుగా ఎస్వీఎస్ ఆస్పత్రిలో కారు డ్రైవర్, ఆయన కుమార్తె చందన అదే ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తుండేవారు. వీరి కుటుంబం ఆస్పత్రి ఎదురుగా ఉన్న కాలనీలో నివాసం ఉంటోంది. సోమవారం రాత్రి కుటుంబ కలహాలతో శివానంద్ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకునేందుకు సమీపంలో ఉన్న రైలు పట్టాలపై వెళ్లాడు. అతడిని కాపాడేందుకు కుమార్తె చందన (20) కూడా వెళ్లింది. అదే సమయంలో రైలు వచ్చి ఢీకొనడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మహిళ ఆత్మహత్య

మిడ్జిల్: మండల కేంద్రంలో పూసలి అలివేల(32) ఉరి వేసుకొని ఆత్మహతకు పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మిడ్జిల్‌కు చెందిన అలివేల కొద్ది నెలల నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడటంతో పాటుగా, ఆర్థిక సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. దీంతో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు, వెళ్లి చూసేసరికి మృతిచెందిందని గ్రామస్తులు తెలియజేశారు. మృతురాలి భర్త లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ బాలకృష్ణ తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఉప్పునుంతల: ఉప్పునుంతల– అచ్చంపేట రోడ్డు మార్గంలోని కట్లబండ స్టేజీ సమీపంలో మలుపు వద్ద సోమవారం రాత్రి బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన గోతిలో పడిపోయింది. దీంతో అమ్రాబాద్ మండలం బీకే తిర్మలాపూర్‌కు చెందిన జటగోని రవికుమార్(25) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రవికుమార్ కుటుంబం పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లోని రెంటచింతల వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఐదు రోజుల కిందట రవికుమార్, తల్లి రాధతో కలిసి అచ్చంపేటలో ఉంటున్న తమ బంధువు నాగరత్నమ్మ వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి సోమవారం ఉదయం రవికుమార్ బైక్‌పై ఉప్పునుంతలలో హోటల్ నడుపుతున్న తన చిన్నమామ ఆంజనేయులు వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు అక్కడే ఉండి రాత్రి 10 గంటల ప్రాంతంలో బైక్‌పై అచ్చంపేటకు బయలుదేరాడు. కట్లబండ స్టేజీ సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన గోతిలో పడిపోయాడు. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. తన అల్లుడు అచ్చంపేటకు చేరుకున్న విషయం తెలుసుకోవడానికి మామ ఆంజనేయులు పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. అనుమానంతో మంగళవారం ఉదయం వారు అచ్చంపేటకు వెళ్లి వెతికినా ఆచూకి లభించలేదు. ఉదయం 11 గంటల ప్రాంతంలో రవికుమార్ రోడ్డు పక్కన గోతిలో పడి మృతిచెందినట్లు సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. మృతుని తల్లి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలియజేశారు.

భవనంపై నుంచి పడి కార్మికుడు..

కొత్తకోట రూరల్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి కిందపడి ఓ తాపీ కార్మికుడు మృతిచెందిన ఘటన మంగళవారం సాయంత్రం కొత్తకోట పట్టణంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. సంకిరెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులు(48) కొంత కాలంగా భార్య, పిల్లలతో కలిసి పట్టణంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటూ మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజువారీ పనిలో భాగంగా పట్టణంలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణ పనులకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు. ఆంజనేయులుకు భార్య నాగమణితో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. ప్రమాదంపై ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డిని వివరణ కోరగా ఘటన గురించి తెలిసిందన్నారు. కానీ ఎలాంటి ఫిర్యాదు అందలేదని వివరించారు.

కుక్కల దాడిలో జింక..

అచ్చంపేట రూరల్: కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని శివసాయినగర్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సమీప పొలాల నుంచి వచ్చిన జింకను కుక్కలు వెంబడించి దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గమనించిన స్థానికులు వాటిని తరిమి జింకను కాపాడే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే అది మృతిచెందింది. దీంతో ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు వారు మృతి చెందిన జింకను అక్కడి నుంచి తీసుకెళ్లారు.

స్థానిక సమరం ఎప్పుడో..?

- పొడిగింపా.. ప్రత్యేక పాలనా!
- వచ్చే నెల 4తో ముగియనున్న మండల, జిల్లా పరిషత్ ప్రజాప్రతినిధుల పదవీకాలం
- ఇప్పటికే గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన

అచ్చంపేట: స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవంతో ఆశావహులు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ఇప్పటికే ముగిసిపోగా, జూలై 4తో మండల పరిషత్, జిలా పరిషత్‌ల పదవీకాలం తీరిపోనుంది. షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థలకు ఎన్నికల తంతును ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేయాల్సి ఉన్నా.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, అంతలోనే ఎమ్మెల్సీ, పార్లమెంట్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ వెలువడటం.. ఈ ప్రక్రియ పూర్తికావడానికి చాలా సమయం పట్టింది. పంచాయతీలకు జనవరిలోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అలాగే మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు కూడా ఇప్పటికే ఎన్నికలు నిర్వహించి ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్ల పదవీ కాలం ముగిసిపోగానే వారి స్థానంలో కొత్త ప్రజాప్రతినిధులకు బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. పార్లమెంట్ ఎన్నికలు ముగిశాక, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. వివిధ కారణాలతో ఆయా అంశాలపై స్పష్టత లేకపోవడంతో ప్రభుత్వపరంగా అటు గ్రామపంచాయతీలు, జిల్లా, మండల పరిషత్ ఎన్నికల నిర్వహణకు అడుగులు పడటం లేదు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన, ఉప కులాల వారీగా రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో పెట్టింది. అయితే ఆ హామీ అమలు చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ ద్వారా చర్యలు చేపట్టాల్సి ఉండగా.. దీనిపై పూర్తి కసరత్తు ప్రారంభం కాలేదు. బీసీ కులగణన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించడం, ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత స్థానిక సంస్థల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో మార్పులు చేయాలని యోచిస్తోంది. ఈ లెక్కన కులగణనకు ఎక్కువ సయం పట్టే అవకాశం ఉండటంతో స్థానిక సంస్థలకు ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో సాగే అవకాశం కనిపించడం లేదు.


అమ్రాబాద్ మండల పరిషత్ కార్యాలయం

పొడిగింపుపై ఆశలు

జిల్లాలో 461 గ్రామపంచాయతీలు ఉండగా.. వాటిలో ప్రత్యేకాధికారుల పాలన సాగుతోంది. 2019 స్థానిక సంస్థల లెక్కల ప్రకారం జిల్లాలో 212 ఎంపీటీసీ, 20 జెడ్పీటీసీ స్థానాల పదవీ కాలం మరో వారం రోజుల్లో ముగిసిపోనుంది. ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ల పదవీ కాలం ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించడం లేదు. దీంతో మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు మరో ఆరు నెలల పాటు పొడిగించే అవకాశం ఉంటుందని ఆశతో ఉన్నారు. గ్రామపంచాయతీలకు ఒకరోజు గడువు ఉండగానే నియమించినట్లు గానే ప్రత్యేకాధికారులను నియమించే అవకాశం కూడా కనిపిస్తోంది. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

ఉమ్మడి జిల్లాల వారీగా వివరాలు ఇలా..

జిల్లా	ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు	గ్రామ పంచాయతీలు
నాగర్‌కర్నూల్	212	20	461
మహబూబ్‌నగర్	184	14	468
నారాయణపేట	142	11	280
గద్వాల	141	12	255
వనపర్తి	128	14	255
మొత్తం	807	71	1,719

ఆశావహుల్లో ఉత్సాహం..

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గ్రామ, మండల స్థాయిలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసిన ఆయా పార్టీల నాయకులు ఇప్పుడు తమ దృష్టిని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడంపై కేంద్రీకరించారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో సర్పంచ్, ఎంపీటీసీ పదవికి పోటీ చేసేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఇప్పుడు మూడు పార్టీల మధ్య రసవత్తర పోటీ జరగనుంది. కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. మూడు పార్టీల మద్ధతుతో పాటు స్వతంత్రులుగా కూడా అధిక సంఖ్యలో పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. యువత కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతోంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ మద్ధతుతో గెలుపొందిన అత్యధిక ప్రజాప్రతినిధులు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తరువాత కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. పాత, కొత్త నేతలతో అధికార పార్టీలో పోటీ అధికంగా ఉండే అవకాశం కనిపిస్తుంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను పార్టీ గుర్తుపై నిర్వహించనున్నారు. దీంతో ఆయా పార్టీల తరఫున పోటీ చేయాలని భావిస్తున్న నేతలు, పార్టీ మద్దతును కూడగట్టేందుకు యత్నిస్తున్నారు. గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలపైనే దృష్టి సారించి ప్రజలను ఆకట్టుకోవడానికి తంటాలు పడుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి అన్నట్లుగా గ్రామాల్లో సందడి నెలకొంది.

కొత్త చట్టామా.. పాత విధానామా

గత ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లు పదేళ్లు వర్తించేలా 2019లో చట్టం రూపొందించి అమలు చేసింది. ఈ చట్టాన్ని రద్దు చేస్తే ప్రజల్లో వ్యతిరేకతతో పాటు ప్రతిపక్ష పార్టీల విమర్శలకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందని భావించి ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త రిజరేషన్ల ప్రక్రియ చేపడుతారా? పాత విధానాన్ని అమలు చేస్తారా?అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. బీసీ కమిషన్ చైర్మన్ నియామకం జరగకపోవడంతో కులగణన కూడా ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో ప్రత్యేకాధికారులను నియమించి, అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటుందనే అభిప్రాయం అధికారుల్లో వ్యక్తమవుతోంది.

ఎన్నికలు నిర్వహించాలి



స్థానిక సంస్థలకు షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలి. ప్రత్యేకాధికారుల పాలనతో ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు టైం ప్రకారం ఎన్నికలు నిర్వహించినట్లు, స్థానిక సంస్థలకు సమయానుగుణంగానే ఎన్నికల తంతు పూర్తి చేయాలి.

– రాంబాబునాయక్, జెడ్పీటీసీ, పదర

నిర్లక్ష్యం తగదు..



చట్టసభలకు ఒకలాగా, స్థానిక సంస్థలకు మరోలా ఎన్నికల తంతు నిర్వహించడం సరికాదు. స్థానిక సంస్థల ఎన్నికలు అంటేనే నిర్లక్ష్యం కనిపిస్తుంది. ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమన్వయం చేసుకుని స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి.

– పంచలింగాల శివ, అమ్రాబాద్

అన్నపై గొడ్డలితో దాడిచేసిన తమ్ముడు

- తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు


గాయాలపాలైన కుర్మయ్య

గోపాల్‌పేట: అన్నపై తమ్ముడు గొడ్డలితో దాడిచేసిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన తూడుకుర్తి కుర్మయ్య స్థానిక వాటర్ ప్లాంట్‌లో పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి దుకాణం ఆవరణలో కుర్మయ్య మద్యం తాగుతుండగా తమ్ముడు కృష్ణయ్య వెనుక నుంచి వచ్చి గొడ్డలితో మెడ, వీపు భాగంలో నరికాడు. తీవ్ర గాయాలపాలైన కుర్మయ్య రక్తపు మడుగులో పడి ఉండగా.. అక్కడే ఉన్న వారు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని పోలీసు వాహనంలో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అన్నాదమ్ముల మధ్య కొంతకాలంగా భూ వివాదాలు ఉన్నాయని గ్రామస్తులు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చారకొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న బాల్‌రాంగౌడ్ (60) సోమవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కల్వకుర్తి మండలం తిమ్మరాసిపల్లికి చెందిన బాల్‌రాంగౌడ్ గత నెల 20న మండలంలోని జూపల్లిలో జరిగిన పండుగకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. సాయంత్రం తిరిగి వెళ్తుండగా కిందపడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. భార్య సత్యమ్మ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు

- 660 కిలోల బెల్లం, పటిక స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు


నల్లబెల్లం స్వాధీన చేసుకున్న అధికారులు

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని రాయవరం శివారులోని పంట పొలాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పొలాల్లోని నాటుసారాను తయారీ కేంద్రాలపై దాడులు చేశారు. సారా తయారు చేస్తున్నారని, బెల్లంను దాచి ఉంచుతున్నారని సమాచారం రావడంతో సోదాలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ రమణయ్య తెలిపారు. బట్టీలను ధ్వంసం చేశామని వివరించారు. అక్రమంగా దాచి ఉంచిన 660 కిలోల బెల్లం, 30 కిలోల పటిక, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వంద లీటర్ల బెల్లం పానకాన్ని పారబోసినట్లు వివరించారు. ఈ మేరకు వి.శ్రీను, భాస్కర్‌లపై కేసునమోదు చేశామని వివరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్దన్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, నాగార్జున, కృష్ణ, మాజాయిద్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ఢీకొని పెయింటర్ మృతి

దేవరకద్ర: ట్యాంకర్ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలపరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగన్న కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా అమరచింత మండలం కొంకనోనిపల్లికి చెందిన ప్రశాంత్ (27) హైదరాబాద్‌లో పెయింటర్‌గా పని చేసేవాడు. సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై సొంత గ్రామానికి బయలుదేరాడు. ఈక్రమంలో తెల్లవారుజామున మరికల్ వైపు నుంచి వస్తున్న ఆయిల్ ట్యాంకర్ గోప్లాపూర్ మలుపులో స్పీడ్ బ్రేకర్ వద్ద ఎదురుగా వస్తున్న ప్రశాంత్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. అతడికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్సనిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా ప్రశాంత్ భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కలలను సాకారం చేసుకోవాలి


గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

హన్వాడ: విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తమ కలలను సాకారం చేసుకోవాలని ఎస్పీ జానకి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దదర్పల్లి శివారులోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తాము కన్న కలలను నిజం చేసుకోవాలని, తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని హితవు పలికారు. ఒకప్పుడు తాను కూడా గురుకులాల్లోనే చదువుకున్నాని గుర్తు చేసుకున్నారు. అందరూ తనలాగే ఉన్నత లక్ష్యంతో చదువుకుని ఈ స్థాయికి వచ్చినట్లు వివరించారు. విద్యార్థినులు తప్పకుండా తమను కన్న తల్లిదండ్రుల కలలను సాకారం చేసుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ఆమె మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

వరి నారుమడి.. యాజమాన్య పద్ధతులు


కడంపల్లి శివారులో నారుమడి

- విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ
- జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట



కోస్గి: రైతులు వానాకాలంలో వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. చెరువుల్లోకి నీరు రాకపోవడంతో బోరుబావులున్న వారు నారుమళ్లు పోసేందుకు సన్నద్ధమవుతున్నందున నారుమడి.. యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధితో ప్రయోజనాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్ సమగ్రంగా వివరించారు. ప్రధానంగా బీపీటీ, తెలంగాణ సోనాతో పాటు వివిధ సన్నరకాలను సాగు చేస్తుంటారు. ఏ రకమైన విత్తనమైనప్పటికీ విత్తనశుద్ధితో తెగుళ్లను నివారించవచ్చు.

విత్తనశుద్ధి..

నారు పోసే ముందు విత్తనశుద్ధి చేస్తే పలురకాల కీటకాలు, తెగుళ్లు ఆశించకుండా నివారించుకోవచ్చు. కిలో విత్తనాలను 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. లేదా కిలో విత్తనాలకు 3 గ్రాముల కాస్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీంతో నారుమడిలో ఆకుతినే పురుగు, ఉల్లికోడు, మువ్వ పురుగు ఆశించకుండా ఉంటాయి.

నాటు విధానం...

నారులో ఆకు లేతగా, ఆకుమచ్చ గడ ఉంటే చేసుత్వరగా తిరుగబడుతుంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి వానాకాలంలో చదరపు మీటర్‌కు 44 దంట్లు (నారు మొలకలు) ఉండేలా చూసుకోవాలి.

నారుమడి తయారీ..

- నారు పోయాల్సిన మడిని 10–12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టేందుకు, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి.
- ఎకరా పొలం నాటడానికి 5 సెంట్లు (500 చ.మీ.) నారుమడి అవసరం. సెంట్ భూమికి 5 కిలోల విత్తనాలు వాడాలి.
- 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వాడాలి.

కలుపు నివారణ..

- నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 7 లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారీ చేయాలి.
- విత్తిన 10 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 150 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. మందును లీటర్ నీటిలో కలిపి విత్తిన 10 రోజులకు పిచికారి చేయాలి.
- విత్తిన 15 రోజులకు సైహాలో పాస్ బ్యూటైట్ 10 శాతం మందు 400 మీ.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- జింక్ లోపాన్ని గుర్తిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ పాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- నారు 20–25 రోజుల వయసున్నప్పుడు 4 నుంచి 6 ఆకుల దశలో నాటుకోవడంతో దిగుబడి అధికంగా వస్తుంది.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మనాయక్

కొల్లాపూర్: మొలచింతలపల్లిలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన దాడి, చెంచు నాగన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ ధర్మానాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని కేఎల్‌ఐ అతిథిగృహంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, అత్యాయత్నం, లైంగిక వేధింపుల కేసులు నమోదు చేయాలన్నారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.నర్సింహ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గం బాలపీరు, సీఐటీయూ నాయకులు ఎం.దశరథం, ఎండీ సలీం, జల్లాపురం సురేందర్, సతీష్, కిరణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్‌ను పెళ్లి చేసుకున్న యువకుడు

- పోక్సో కేసునమోదు

మహబూబ్‌నగర్ క్రైం: ఓ మైనర్(బాలిక)ను కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకుని ముంబయి తీసుకువెళ్లిన యువకుడిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసునమోదైంది. టూటౌన్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం.. ప్రకారం జిల్లా కేంద్రంలోని బోయపల్లికి చెందిన 16 ఏళ్ల బాలిక డీఈఓ కార్యాలయం సమీపంలో ఓ దుకాణంలో టైలరింగ్ పని చేస్తోంది. ఆమెకు మద్దూర్ మండలం చెన్నారం గ్రామానికి చెందిన ఓ యువకుడితో పెళ్లి సంబంధం చూశారు. కానీ వయసు తక్కువగా ఉండడంతో తల్లిదండ్రులు పెళ్లి వద్దనుకున్నారు. కాగా సదరు యువకుడు ఆమె టైలరింగ్ పని చేసే చోటుకు పలుమార్లు పెళ్లి చేసుకుందాం అంటూ వచ్చి కలిసేవాడు. ఈ క్రమంలో జూన్ 18న బాలికను తీసుకువెళ్లి గురుమిటికల్‌లోని శివాలయంలో పెళ్లి చేసుకున్నాడు. అక్కడి నుంచి ముంబయికి తీసుకువెళ్లాడు. ఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో కిడ్నాప్ కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అదేవిధంగా సదరు యువకుడిపై పోక్సో కేసుసైతం నమోదు చేసినట్లు వివరించారు .

పాతకక్షలతో వ్యక్తిపై దాడి: కేసు నమోదు

వంగూరు: మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి స్టేజీ సమీపంలో శేఖర్ అనే వ్యక్తిపై మంగళవారం రాత్రి కొందరు దాడిచేశారు. ఎస్‌ఐ మహేందర్ కథనం ప్రకారం.. సర్వారెడ్డిపల్లికి చెందిన శేఖర్, మరో ఇద్దరు బైక్‌పై డిండి నుంచి గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో తిరుమలగిరి తండాకు చెందిన రాజు మరో ఇద్దరు బైక్‌లపై వచ్చి శేఖర్‌ను అడ్డగించి బీరుసీసాతో దాడిచేశారు. ఘటనలో గాయపడ్డ శేఖర్‌ను 108లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా దాడికి కారణమైన వారిపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరి మధ్య గతంలో ఉన్న పాత కక్షలే కారణమని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైతు భరోసా కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా భట్టి



సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా విధివిధానాల రూపకల్పనకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చైర్మన్‌గా కేబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. రైతు భరోసా పథకం అమలు కోసం అవసరమైన సిఫార్సులు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తరులు జారీ చేశా రు. ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ విష యాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనెల 15 నాటికి మార్గదర్శకాలకు సంబంధించిన నివేదిక సమర్పించాలని అప్పట్లో కో రారు. ఈ నేపథ్యంలో అధికారికంగా కేబినెట్ సబ్ కమిటీ కి సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించిన ఏబీవీపీ

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ మండిపడ్డారు. నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రూప్–1, 2 పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించాలన్నారు. గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 పద్ధతిలో అభ్యర్థులను పిలవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల సంఖ్య పెంచే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగ సమస్యలను పెంచాలని కోరుతూ ఏబీవీపీ చేపట్టిన ధర్నా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. టీజీపీఎస్సీ కార్యాలయం లోపలికి వెళ్లేందుకు యత్నించిన ఏబీవీపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో విద్యార్థి నాయకులు రోడ్డుపైనే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య కొంత తోపులాట జరిగింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి నాయకులు నినాదాలతో హోరెత్తించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థి నాయకులను పోలీసులు అడ్డుకుని వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

కసరత్తు కొలిక్కి

▶ మొదటి పేజీ తరువాయి

అడ్లూరి లక్ష్మణ్‌కు అవకాశం ఇవ్వాలని మంత్రి డి.శ్రీధర్‌బాబు, సీనియర్ నేత జీవన్‌రెడ్డి అధిష్టానాన్ని కోరినట్లు తెలుస్తోంది. అన్ని ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం వారిలో ఒకరిని ఈ నెల ఆరో తేదీలోగా పీసీసీ చీఫ్‌గా ప్రకటిస్తారని గాంధీ భవన్ వర్గాలు అంటున్నాయి. దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో మరోమారు అధిష్టానం చర్చించనుంది. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. వారితో చర్చించాక టీపీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అధిష్టానం తుది నిర్ణయం తీసుకోనుంది. అయితే మహేశ్‌కుమార్ గౌడ్ వైపు అధిష్టానం మొగ్గుచూపే అవకాశం ఉందని గాంధీ భవన్ వర్గాలు అంటున్నాయి.

మంత్రివర్గం రేసులో బాలూనాయక్, టి. రామ్మోహన్‌రెడ్డి

మంత్రివర్గ విస్తరణలో నల్లగొండ జిల్లాకు చెందిన లంబాడా సామాజికవర్గానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఎస్. బాలూనాయక్‌కు అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. గిరిజన వర్గాల నుంచి ఆదివాసీలకు ఇప్పటికే కేబినెట్‌లో స్థానం కల్పించినందున లంబాడా సామాజికవర్గానికి కూడా అనివార్యంగా మంత్రి పదవి ఇవ్వాల్సి ఉంటుందని, ఈ కోటాలో బాలూనాయక్ పేరు కూడా ఉందని తెలుస్తోంది. బాలూనాయక్‌కు మంత్రి పదవి లభిస్తే డిప్యూటీ స్పీకర్‌గా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఎంపిక చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే అదే జిల్లాకు చెందిన పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి కూడా మంత్రివర్గంలో స్థానం కోసం ఢిల్లీలోనే ఉండి ప్రయత్నాలు చేస్తున్నారు. వారిలో ఎవరిని ఏ పదవికి ఎంపిక చేయాలనే విషయంపైనా బుధవారం నాటి చర్చల్లో స్పష్టత రానుంది.

పీసీసీ చీఫ్‌గా నా పేరు పరిశీలించండి

ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసి కోరిన మహేశ్‌కుమార్‌గౌడ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా తన పేరును పరిశీలించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో ఖర్గేను ఆయన కలిశారు. పీసీసీ చీఫ్ పదవి ఆశిస్తున్న నేతలు అధిష్టానం పెద్దలను కలుస్తూ తమ పేర్లను పరిశీలించాలని కోరుతున్నారు. అందులో భాగంగానే మహేశ్‌కుమార్‌గౌడ్ ఖర్గేను కలిసి తన పేరును పరిశీలించాలని కోరినట్లు తెలిసింది. ఆయన ఇటీవల కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతోపాటు జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కూడా కలవడం తెలిసిందే.

గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం



గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రోడ్డు మార్గంలో తాడేపల్లికి పయనం

సాక్షి,అమరావతి/విమానాశ్రయం (గన్నవరం): బెంగళూరు పర్యటన ముగించుకుని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లికి చేరుకున్నారు. బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో సతీమణి వైఎస్ భారతీ రెడ్డితో కలిసి ఆయన మంగళవారం మధ్యాహ్నం 2.50 గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. విమానాశ్రయంలో జగన్‌కు ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, మాజీ మంత్రులు పేర్ని నాని, మేరుగు నాగార్జున, వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, సింహాద్రి రమేష్‌బాబు, కైలే అనిల్‌కుమార్, దూలం నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు దేవినేని అవినాశ్, షేక్ ఆసిఫ్, అంబటి మురళీకృష్ణ, ఏపీ ఫైబర్‌నెట్ మాజీ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలతో ఎయిర్‌పోర్ట్ ప్రాంతమంతా మార్మోగింది. వీరందరిని వైఎస్ జగన్ ఆప్యాయంగా పలకరించారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా తాడేపల్లి బయలుదేరి వెళ్లారు.

ఆర్‌ఎంపీల సమస్యలు పరిష్కరిస్తా

మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పరిష్కరిస్తానని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీఇచ్చారు. ఈ మేరకు మంత్రిని హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో వచ్చిన ప్రతినిధుల బృందం కలిసింది. రాష్ట్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను జారీ చేయాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధుల బృందం రాష్ట్రంలో ఉన్న ఆర్‌ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రికి వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 1273 ద్వారా రూ.4.32 కోట్ల నిధులతో వివిధ సెంటర్ల ద్వారా 12,900 మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలు శిక్షణ పూర్తి చేసుకున్నా.. వారికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇవ్వలేదన్నారు. వెంటనే పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లను ప్రదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘాల ఉమ్మడి వేదిక నాయకులు రమేశ్, శంకర్ ముదిరాజ్, బాల బ్రహ్మచారి, వెంకట్‌రెడ్డి, హుస్సేన్, మోహన్ పాల్గొన్నారు. కాగా, మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్ లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాల యంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవ సర మందులు అందుబాటులో ఉండేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదే శించారు. వైద్య సదుపాయాల కల్పనలో భా గంగా భౌగోళికంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రు లు ఎంత దూరంలో ఉన్నాయో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని సూచించారు.

దానం నాగేందర్ ఎన్నికపై సుప్రీంకోర్టు కెళ్తాం

మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరి సికింద్రాబాద్ నుంచి ఎంపీగా పోటీచేసిన దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కొరియర్, మెయిల్, రిజిస్టర్ పోస్ట్ ద్వారా స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు తెలిపారు. తాము సమర్పించిన పిటిషన్లపై స్పీకర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిపై పోటీచేసిన నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని డిమాండ్‌చేశారు. ఈ వేటు ద్వారా నాగేందర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఖైరతాబాద్ అసెంబ్లీకి ఉపఎన్నిక రావాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.

చంద్రబాబును సీబీఐ, ఈడీ ఎందుకు అరెస్టు చేయలేదు?

▶ మొదటి పేజీ తరువాయి

ఆరోపణలు చేశారని, మరి చంద్రబాబు, అజిత్ పవార్, ప్రఫుల్లపటేల్‌ల విషయంలో జరిగిందేమిటీ అని ప్రశ్నించారు. వీరిపై కేసులు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయన్నారు. సీబీఐ, ఈడీలు చంద్రబాబును అరెస్ట్ చేస్తాయా అని నిలదీశారు. టీడీపీ అధినేతను ఎందుకు సీబీఐ, ఈడీ అరెస్ట్ చేయలేదు అని ప్రశ్నించారు. బీజేపీ పంచన చేరగానే వాషింగ్ మెషీన్‌లో వేసిన మాదిరి వారంతా సుద్ధపురుషులు అయ్యారంటూ ఎద్దేవా చేశారు. అవినీతిపరులైన నేతలను కలుపుకొని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అగత్యం మోదీ ప్రభుత్వానికి ఏర్పడిందని దుయ్యబట్టారు.

ఆ కంపెనీకి లాభాలు ఎలా వచ్చాయి..

ఎన్నికల సర్వేల అంశాలపై కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ.. బీజేపీ కూటమి 400 సీట్లు దాటుతుందంటూ ఎగ్జిట్ పోల్ సర్వేల ద్వారా ప్రచారం చేసి, స్టాక్‌మార్కెట్‌లో షేర్లు కొనాలని ప్రోత్సహించారని విమర్శించారు. ఫలితాల రోజున ఒకవైపు స్టాక్‌మార్కెట్ పడిపోయి రూ. 31 లక్షల కోట్లు మదుపరుల సంపద ఆవిరైపోతే, టీడీపీ అగ్రనేత భార్యకు చెందిన కంపెనీ మాత్రం రూ. 521 కోట్లు ఆ ఒక్కరోజులోనే ఆర్జించిందని వెల్లడించారు. ఇదెలా సాధ్యమైందని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపే దమ్ము ప్రభుత్వానికి ఉందా? అని నిలదీశారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగదని ఆయన జోస్యం చెప్పారు. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఎన్డీఏ ప్రభుత్వం కూలిపోతుందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగలేదని, ఎన్నికల అధికారులు బీజేపీకి అనుకూలంగా పనిచేశారని విమర్శించారు. ఎమర్జెన్సీ తర్వాత ఏ ప్రధాని కూడా ఈడీ, సీబీఐని ఇంతలా దుర్వినియోగం చేయలేదన్నారు. రాష్ట్రాల్లో పాలన సాగిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై వివక్ష పూరిత వైఖరి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. బెనర్జీ తన ప్రసంగాన్ని ముగించిన తర్వాత, బీజేపీకి చెందిన భూపేందర్ యాదవ్ మాట్లాడుతూ, ఎన్డీఏ మిత్రపక్షాలైన టీడీపీ, జేడీయూలపై చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్ ఓంబిర్లాను కోరారు.

డిజిటల్ సమాచారం తొలగింపును అడ్డుకోండి

ప్రభుత్వ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ తొలగించడం సరికాదు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చరిత్ర, ప్రాముఖ్యతకు సంబంధించిన ఆధారాలు, డిజిటల్ సమాచారాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్లు, సోషల్‌మీడియా హ్యాండిల్స్ నుంచి తొలగించడం సరికాదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వానికి సంబంధించిన డిజిటల్ సమాచారాన్ని ఉద్దేశపూర్వంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో జోక్యం చేసుకొని డిజిటల్ సమాచారాన్ని కాపాడాలని ప్రభుత్వ ప్రధా నకార్యదర్శి శాంతికుమారికి మంగళవారం కేటీఆర్ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగించిన వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ వివరాలను ఆ లేఖలో కేటీఆర్ జత చేశారు. సీఎంగా కేసీఆర్ పనిచేసిన కాలానికి సంబంధించిన (జూన్ 2014 – డిసెంబర్ 2023) వేలాది ఫొటోలు, వీడియోలతోపాటు ఎంతో విలువైన సమాచారం తొలగించారన్నారని లేఖలో పేర్కొన్నారు. 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్‌లు, మీడియా హ్యాండిల్స్‌లో ముఖ్యమైన కంటెంట్, సమాచారం కనబడకుండా పోతోందని, కొన్ని ముఖ్యమైన వెబ్‌సైట్లు కూడా తొలగించారని చెప్పారు. ఈ చర్యల వెనుక రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు ఉన్నారనే సందేహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలకు సంబంధించిన మొత్తం డిజిటల్ కంటెంట్‌ను భద్రపర్చాల్సిన అవసరముందన్నారు. పబ్లిక్ డొమైన్ నుంచి తొలగించిన కంటెంట్‌ను వెంటనే పునరుద్ధరించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

జూరాలకు నిలిచిన వరద



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద నిలిచిపోయినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం కోయిల్ సాగర్‌కు 315 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–2కు 844, ఇతర అవసరాలకు 337, సమాంతర కాల్వకు 800 క్యూసెక్కులు వినియోగించగా.. 110 క్యూసెక్కుల నీరు ఆవిరైందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.682 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

రామన్‌పాడులో నిలకడగా..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం 1,019 అడుగుల నీటిమట్టం ఉందని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల సమాంతర కాల్వ ద్వారా 800 క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. ఎడమ కాల్వ నుంచి నీటి సరఫరా లేదన్నారు. లిఫ్ట్‌లకు 844 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు చెప్పారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండవెల్లి: పొలంలో అక్రమంగా విత్తనాలు వేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలియజేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని రెడ్డిపోగు దినకర్‌కు చెందిన ఆరు ఎకరాల పొలాన్ని ఉండవెల్లికి చెందిన వ్యక్తులకు కౌలుకు ఇచ్చాడు. కంచుపాడుకు చెందిన వెంకటేశ్వర్లు అక్రమంగా రెండు ఎకరాల్లో ఎవరికి తెలియకుండా పొలంలో అడ్డంగా కందులు వేశాడు. గతంలో మూడు సార్లు అక్రమంగా, దౌర్జన్యంగా పంట పొలాన్ని దున్నాడని, గత నెల 28న 2 ఎకరాల్లో ఎవరికీ తెలియజేయకుండా దౌర్జన్యంగా కంది పంట సాగు చేశాడని భూ యజమాని రెడ్డిపోగు దినకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

గద్వాల క్రైం: వ్యక్తి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన ఎరుకలి నరసింహ డ్రైవర్‌గా పనిచేసు కుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 28న ఇంటి నుంచి బయటకు వెళ్లి నేటికి ఇంటికి తిరిగి రాలేదు. ఈ విషయమై భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

నేటి నుంచి బ్యాడ్మింటన్ టోర్నీ



ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ నెట్‌లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

- మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ
- మొదటగా క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లు
- 4 నుంచి మెయిన్ డ్రా పోటీలు
- ఏర్పాట్లు చేసిన జిల్లా అసోసియేషన్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలో అనేక స్టేడియంలు ఉన్నప్పటికీ ఇండోర్ స్టేడియం లేకపోవడంతో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలు నిర్వహించడానికి అంతగా అవకాశం రాలేదు. తాజాగా పాలమూరులో అన్ని వసతులతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం చేశారు. ఇప్పుడు రాష్ట్ర, జాతీయస్థాయి ఇండోర్, బ్యాడ్మింటన్ క్రీడాపోటీలకు జిల్లా యువజన, క్రీడాశాఖ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం వేదికకానుంది. ఈ క్రమంలోనే జిల్లాకేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బుధవారం నుంచి శనివారం వరకు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు. 10వ రాష్ట్రస్థాయి జూనియర్ (అండర్–19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ జరగనుంది. జిల్లాకేంద్రంలో తొలిసారిగా ఈ మేరకు మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ (ఎండీబీఏ) ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆరు కోర్టుల్లో మ్యాచ్‌ల నిర్వహణ

రాష్ట్రస్థాయి అండర్–19 బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌నకు మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలోని నాలుగు కోర్టుల్లో సింథటిక్ మ్యాట్‌లపై మ్యాచుల్లో జరగనున్నాయి. బుధవారం క్వాలిఫైయింగ్ రౌండ్, 4 నుంచి 6 వరకు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ విభాగాల్లో మెయిన్‌డ్రా పోటీలు జరుగుతాయి. ఈ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఉమ్మడి జిల్లాల్లోని 120 నుంచి 150 మంది క్రీడాకారులు, 12 నుంచి 15 మంది అఫీషియల్స్ పాల్గొంటున్నారు. టోర్నీ ప్రారంభోత్సవానికి ఎంపీ డీకే అరుణ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల శాఖ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ హాజరుకానున్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఏర్పాట్లను మహబూబ్‌నగర్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు పరిశీలించారు.

విజయవంతంగా నిర్వహిస్తాం



తొలిసారిగా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహిస్తున్నాం. అందరి సహకారంతో చాంపియన్‌షిప్‌ను విజయవంతంగా పూర్తిచేస్తాం. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– శ్యాంసుందర్‌గౌడ్, ఎండీబీఏ అధ్యక్షుడు

క్రీడాకారుల్లో ఉత్సాహం



జిల్లాకు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ కేటాయించినందుకు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణకు ధన్యవాదాలు తెలుపుతున్నాం. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, జిల్లా యువజన, క్రీడాశాఖ సహకారంతో జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం. రాష్ట్రస్థాయి టోర్నీతో ఉమ్మడి జిల్లాలో బ్యాడ్మింటన్ క్రీడపై ఔత్సాహిక క్రీడాకారుల్లో ఉత్సాహం నింపుతుంది.

– రవికుమార్, ఎండీబీఏ ప్రధాన కార్యదర్శి

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

రాష్ట్ర ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి: పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మండల అభివృద్ధికి ఐదేళ్ల కిందట రూర్బన్ మిషన్ పథకం ద్వారా రూ.31 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో రూ.15 కోట్ల రూర్బన్ పనులు మాత్రమే చేపట్టారని, మిగతా రూ.15 కోట్ల పనులు చేపట్టకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. వెనక్కి వెళ్లిన నిధులను, ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానన్నారు. పెండింగ్‌లోని కాల్వల పనులు త్వరితగతిన అధికారులు పూర్తిచేసి 18,000 ఎకరాలకు పెద్దకొత్తపల్లి మండలంలో సాగునీరు అందించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల, మెటీరియల్ పంపిణీ విషయంలో ఇబ్బందులు కలిగించవద్దని ఏఈ ప్రదీప్‌గౌడ్‌కు సూచించారు. అనంతరం సీఎంఆర్ గార్డెన్‌లో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ రూ.6 లక్షల విలువ చేసే ట్రైసైకిళ్లను సొంత డబ్బులతో ఇవ్వగా మంత్రి జూపల్లి కృష్ణారావు వికలాంగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈసూప్‌అలీ, ఎంపీడీఓ నాగేందర్, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, మైసమ్మ, శ్రీనివాసులు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షులుగా బీసీలను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌సాగర్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు బీసీలను రాష్ట్ర అధ్యక్షులుగా నియమించాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్ డిమాండ్‌చేశారు. జిల్లాకేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలన్నీ బీసీవాదం వైపు చూస్తున్న తరుణంలో రాష్ట్ర జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కాంగ్రెస్ నుంచి సీఎంగా రేవంత్‌రెడ్డి ఉన్నారని, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీకి అవకాశం ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు ఎక్కడ తగిన ప్రాధాన్యత కల్పించలేదని, నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా బీసీలే వివక్షతకు గురయ్యారని ఆరోపించారు. బీజేపీ తాము అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని ప్రకటించి బీసీల పక్షాన నిలిచారని, ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగానైనా బీసీని నియమించాలని హితవు పలికారు. బీఆర్‌ఎస్ పార్టీ రెండుసార్లు అధికారంలో ఉండి ప్రస్తుతం కనుమరుగయ్యే పరిస్థితిలో ఉందని, ఇప్పటికైనా బీసీకి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. కుటుంబ పార్టీగా ఉన్న బీఆర్‌ఎస్ పేరును కాస్త ప్రజల పార్టీగా మార్చేందుకు ఇదొక మంచి అవకాశం అని సూచించారు. సమావేశంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, ఆశన్న ముదిరాజ్, సవారి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్ యజమానిపై కేసు నమోదు



ఆత్మకూర్: పట్టణంలోని కొండ కృష్ణయ్య రైస్‌మిల్లును సీజ్ చేసి యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. వారి కథనం మేరకు.. జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ షేక్ ఇర్ఫాన్ బృందం మంగళవారం రైస్‌మిల్లును తనిఖీ చేసింది. యజమాని 2021–22, 2022–23 వానాకాలం, యాసంగి సీజన్‌కు సంబంధించి రూ.4.74 కోట్ల విలువజేసే 33,927 బస్తాల బియ్యం పౌరసరఫరాలసంస్థకు అప్పగించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో అధికారులు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ, ఎస్‌ఐ వివరించారు.

రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: దివిటిపల్లి డబుల్‌బెడ్ రూం కాలనీకి వెళ్లే దారిపై వర్షం నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో మంగళవారం డబుల్‌బెడ్‌రూంల అభివృద్ధి ఐక్యవేదిక ఆధ్వర్యంలో రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి మోహన్ మాట్లాడారు. కాలనీలో 1024 ఇళ్లు ఉన్నాయని, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. కాలనీ రోడ్డు శిథిలావస్థకు చేరుకుని రైల్వే అండర్ పాస్ కింద మూడు ఫీట్ల వరకు నీళ్లు నిలుస్తున్నాయని అన్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని అన్నారు. అధికారులు తక్షణమే స్పందించి రైల్వే బ్రిడ్జి కింద వీధిలైట్లు ఏర్పాటు చేసి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని డిమాండ్ చేశారు. నల్లవెల్లి కురుమూర్తి, రాఘవేందర్‌గౌడ్, రాజ్‌కుమార్, సంజయ్‌కుమార్, శశికుమార్, అఖిల్, సోను, హరి తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

ఉండవెల్లి: కారు బోల్తాపడగా నలుగురికి గాయాలైన ఘటన మండలపరిధిలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి సమయంలో తిరుపతి నుంచి జడ్చర్లలోని తాడిపత్రి వైపు 6గురు వ్యక్తులు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలపరిధిలోకి వచ్చిన సమయంలో డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు పడిపోయింది. ఘటనలో కారులో ఉన్న వెంకట్రాముడు, భానుకిరణ్, సురేష్ కుమార్, రవి గాయపడ్డారు. కాగా వారిని కర్నూల్ ఆస్పత్రికి 108లో తరలించారు.